www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
అనంతపురము జిల్లా / శ్రీ సత్యసాయి జిల్లా

## ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

- ఎస్టీయూ రాష్ట్ర ప్రథమ కార్యవర్గ సమావేశం
- ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు ఎన్. రమణారెడ్డి




**అనంతపురం,మార్చి15.అక్షర టైమ్స్:** అనంతపురం జిల్లా లో ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు ఎన్.రమణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఎస్టీయూ రాష్ట్ర ప్రథమ కార్యవర్గ సమావేశం గుంటూరు నందు నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు ఎన్.రమణారెడ్డి మాట్లాడుతూ.. వేసవిలో జరిగే ఉపాధ్యాయ బదిలీల్లో అన్ని కేటగిరీల వారికి జీరో సర్వీస్ ఉండేటట్లు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి అందరికీ తగిన న్యాయం జరిగేటట్లు కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. అలాగే దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న అన్ని ఆర్థిక బకాయిల చెల్లింపులకు కృషి చేయాలని, మున్సిపల్ ఉపాధ్యాయుల పిఎఫ్ అకౌంట్ ల కోసం రాష్ట్ర అధికారులతో మాట్లాడి వాటి అమలుకు కృషి చేయాలన్నారు. కేజీబీవీ లలలో పనిచేసే స్టాఫ్ కు మినిమం టైం స్కేల్ వర్తింపచేయాలని, దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న కంబైన్డ్ సర్వీస్ రూల్స్ సమస్యలను పరిష్కరించి అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లకు లెక్చరర్స్ గా పదోన్నతులు కల్పించేందుకు తప్పకుండా కృషి చేయాలన్నారు. అలాగే ఐఆర్ 30శాతం ప్రకటనకు కృషి చేయాలని, మెడికల్ బిల్లులు త్వరితగతిన మంజూరుకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని, గత సంవత్సరం బదిలీలలో పిఎస్ హెచ్ఎం లుగా వెళ్లిన స్కూల్ అసిస్టెంట్లకు ప్రస్తుతం జరగబోయే బదిలీలలో తప్పకుండా సమ్మతి ఉన్న వారు వారి సబ్జెక్టు కన్వర్షన్ కు కృషి చేయాలన్నారు. క్లస్టర్ లో పనిచేసే వారికి పర్మనెంట్ స్థానాల కోసం జరగబోయే బదిలీలలో తప్పకుండా కృషి చేయాలని, తెలుగు హిందీ ఉర్దూ స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు అర్హత కలిగిన ఎస్ జి టి లకు ఉన్న పోస్టులలో 70 శాతం పదోన్నతుల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి తప్పకుండా కృషి చేయాలన్నారు. టెట్ రద్దుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి ఉపశమనం కల్పించేందుకు ఎస్టీయూ కృషి చేయాలని, వీటన్నింటినీ తప్పకుండా సాధించడానికి ఎస్టీయూ కృషి చేయాలని రాష్ట్ర నాయకత్వాన్ని రమణారెడ్డి కోరారు.

## ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ ఔదార్యం

- పాఠశాల పైకప్పు నిర్మాణానికి ముందుకొచ్చిన శ్రీరామ్
- గత వైసీపీ ప్రభుత్వంలో దొరిగల్లులో ఆగిపోయిన పాఠశాల నిర్మాణం
- విద్యార్థుల ఇబ్బందులు చూసి సొంత ఖర్చులతో నిర్మాణానికి ముందుకొచ్చిన శ్రీరామ్





**ధర్మవరం,మార్చి15.అక్షర టైమ్స్:** ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ మరోసారి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. ఆదివారం ముదిగుబ్బ మండలం దొరిగల్లులో ఓ వివాహ వేడుకకు శ్రీరామ్ హాజరయ్యారు. అదే సమయంలో ఆయన గ్రామంలో వెళ్తున్నప్పుడు ప్రభుత్వ పాఠశాల వద్ద 10వ తరగతి విద్యార్థులు చెట్ల కింద కూర్చుని చదువుకుంటుండటం గమనించారు. ఎందుకు మీరంతా చెట్ల కింద ఉన్నారని ఉపాధ్యాయులు, విద్యార్థులను ఆరా తీయగా.. పాఠశాలలో భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయని వారు సమాధానం ఇచ్చారు. వెంటనే శ్రీరామ్ పాఠశాలను పరిశీలించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 2022-24సమయంలో నాడు-నేడు కింద పాఠశాల నూతన భవనాల నిర్మాణాలు చేపట్టారన్నారు. అయితే అప్పట్లో కేవలం గోడలు మాత్రమే నిర్మించి వదిలేశారన్నారు. 160మంది పిల్లలకు కేవలం నాలుగు గదులే ఉన్నాయని.. అవి కూడా అసంపూర్తిగా నిలిచిపోయాయన్నారు. గత మూడేళ్లుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్థులు అన్నారు. ఫోన్ ద్వారా విద్యాశాఖ అధికారులతో మాట్లాడారు. నూతన భవనాల నిర్మాణం ప్రతిపాదనలో ఉందని చెప్పారు. దీంతో శ్రీరామ్ వెంటనే తన సొంత ఖర్చులో పై కప్పు నిర్మిస్తానని గ్రామస్థులకు, విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఉన్నతాధికారులతో మాట్లాడి పాఠశాలకు నిధులు కూడా వచ్చేలా కృషి చేస్తానన్నారు. వెంటనే పైకప్పు నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. గ్రామస్థులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు శ్రీరామ్ కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంస్థకు ఉగాది పురస్కారం




**అనంతపురం,మార్చి15.అక్షర టైమ్స్:** నగరంలోని ఆపిల్ ఫంక్షన్ హాలులో మహా యోగ కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉగాది పురస్కారాలను సంస్థ అధ్యక్షుడు యోగా మహేష్ బాబు నేతృతంలో నిర్వహించారు. అందులో భాగంగా ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంస్థ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ చాందినికి ఉగాది పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా మహా యోగ కల్చరల్ సంస్థ అధ్యక్షుడు యోగ మహేష్ మాట్లాడుతూ.. ఎస్సార్ ఎడ్యుకేషన్ సొసైటీ సమాజంలో విద్యార్థులకు అనేక సామాజిక అంశాలపై అవగాహన కల్పిస్తూ.. పాఠశాలలో గుడ్ టచ్, బాడ్ టచ్, మహిళా అక్షరాస్యతకు తోడుపడుతూ, బాల్యవివాహాలపై, క్యాన్సర్పై అవగాహన కల్పించినందుకు గాను సంస్థకు ప్రతి ఏటా మా సంస్థ మహిళలను సత్కరించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా ఎస్సార్ ఎడ్యుకేషన్ సొసైటీ చేసిన సేవలకు గాను సొసైటీ సభ్యులను షేక్ చాందినిని సత్కరించినట్లు తెలిపారు.

## ముస్లిం సోదరులకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు

- ముస్లింలకు పవిత్రమైన పండుగ రంజాన్
- మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందు
- వైఎస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్నారై కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి





**బుక్కరాయసముద్రం,మార్చి15.అక్షర టైమ్స్:** వైఎస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్నారై కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి ముస్లింలకు ఎంతో పవిత్రమైన పండుగ రంజాన్ మాసమని వైఎస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్నారై కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి తెలిపారు. ఉపవాస దీక్షలు, ప్రార్థనలు, దానధర్మాలతో రంజాన్ మాసం ముస్లింలకు ఆధ్యాత్మికంగా ఎంతో ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఎస్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో సింగనమల మాజీ శాసనసభ్యురాలు జొన్నలగడ్డ పద్మావతి, వైఎస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలూరు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఘనంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన ముస్లిం సోదరులతో కలిసి నమాజ్లో పాల్గొన్నారు. అనంతరం అందరికీ ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, అల్లా చల్లని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. అలాగే మత సామరస్యాన్ని కాపాడుతూ అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహ్మద్, పొలిటికల్ అడ్వైజర్ కమిటీ మెంబర్ (పీఎస్ సభ్యులు) ఎస్ యండి ఇస్మాయిల్ , వైస్సార్సీపీ మైనారిటీ జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ముస్లిం మత పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## పండుగ పూట ముస్లిం సోదరుల నోటి వద్ద ముద్ద లాగిన వ్యక్తి జగన్

- తాను మంత్రిగా ఉన్న సమయంలోనే రంజాన్ తోఫా ఇచ్చాం
- రంజాన్ తోఫా పంపిణీ, ఇఫ్తార్ విందు సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత
- పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ తరపున రంజాన్ తోఫా పంపిణీ







**అనంతపురం,మార్చి15.అక్షర టైమ్స్:** ముస్లిం సోదరులు అతి పెద్ద పండుగగా జరుపుకునే రంజాన్ రోజు వారి నోటి వద్ద ముద్ద లాగిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో ఆమె రంజాన్ తోఫా పంపిణీ, ఇఫ్తార్ విందు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆదివారం సాయంత్రం ఆత్మకూరు మండల కేంద్రంలోని కనకదాస కళ్యాణమండపంలో పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక మైనార్టీ నాయకులకు రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సునీత హాజరయ్యారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా సుమారు 200 కుటుంబాలకు, 8రకాల వస్తువులతో రంజాన్ తోఫా అందజేశారు. అనంతరం స్థానికంగా ఉన్న రెండు మసీదుల్లో నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఎమ్మెల్యే సునీతకు స్థానిక మైనార్టీ నాయకులు, మతపెద్దలు ఘన స్వాగతం పలికారు. ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం వారికి పండ్లు అందజేసి దీక్షలు విరమింపజేశారు. ఆ తర్వాత ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వయంగా వారికి భోజనం వడ్డించారు. ఉదయం రాప్తాడు మండలం చిన్మయనగర్ కు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త బాష అతని మిత్రుల ఆధ్వర్యంలో అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో రంజాన్ తోఫా పంపిణీ చేశారు. 2వందల ముస్లిం కుటుంబాలకు 6రకాల వస్తువులతో కూడిన రంజాన్ తోఫా కిట్ ను సునీత అందజేశారు. రంజాన్ మాసంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టిన మైనార్టీ నాయకులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ.. ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకునే పండుగ రంజాన్ అని అన్నారు. తాను పౌరసరఫరాలశాఖ మంత్రిగా ఉన్న సమయంలోనే రంజాన్ తోఫాను ప్రారంభించామన్నారు. అప్పుడు ఆ కానుక అందిస్తున్నప్పుడు ముస్లింల కళ్లలో ఆనందం చూశామన్నారు. అయితే జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక ఆ పథకాన్ని రద్దు చేసినప్పుడు ముస్లిం సోదరులు ఎంతో ఆవేదన వ్యక్తం చేశారన్నారు. ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చాక మళ్లీ మైనార్టీల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. మరోసారి రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమాన్ని పునఃప్రారంభించేలా ప్రణాళికలు చేస్తున్నట్టు ఆమె తెలిపారు. ఆత్మకూరు మండలం కేంద్రంలోని మసీదుల్లో సమస్యల పరిష్కారం కూడా చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించబోతున్నామని ప్రతి ఇంటికి కొళాయి వస్తుందని ఎమ్మెల్యే సునీత స్పష్టం చేశారు.

## యుద్ధం సాకుతో జరుగుతున్న బ్లాక్ మార్కెట్ను అరికట్టాలి

- సరసమైన ధరలకు వంటగ్యాస్,ఇతర సరుకులు అందించాలి
- సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున డిమాండ్




**రాయదుర్గం,మార్చ్15.అక్షర టైమ్స్:** ఇరాన్పై అమెరికా, ఇజ్రాయిల్ దురాక్రమణ దాడి తర్వాత లాభాపేక్షతో బడా వ్యాపారస్తులు సాగిస్తున్న బ్లాక్మార్కెట్ను అరికట్టి సరసమైన ధరలకు వంటగ్యాస్, ఇతర సరుకులు అందించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ నాయకులతో కలిసి స్థానిక వినాయక కూడలి నందు అరగంట పాటు గ్యాస్ ధరల పెంపుకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ,వంటగ్యాస్ ధర పెరగడంతో పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు గ్యాస్ ధరల పెంపు మోయలేని భారంగా మారిందని ఆగ్రహం వ్యక్తులు చేశారు. అదేవిధంగా బ్లాక్ మార్కెటింగ్ వల్ల సిలిండర్లు దొరకని కారణంగా దేశమంతటా నగరాలు, పట్టణాల్లో అనేక హోటళ్లు మూతపడే పరిస్థితి నెలకొందని, కొన్ని రకాల వంటకాలు లభించడం లేదని, పరిస్థితి ఇలాగే కొనసాగితే సాధారణమైన తోపుడుబండ్లు, చిన్న చిన్న కాకా హోటళ్ల నిర్వాహకుల బతుకులు బజారున పడతాయని,అసంఘటిత కార్మికులు, చిరుద్యోగులకు లభించే టీ, టిఫిన్, భోజనం సరసమైన ధరకు దొరక్కుండా పోయే ప్రమాదం ఏర్పడుతుందని, గ్యాస్ ధరల పెంపు వల్ల ఆహార పదార్థాల ధరలు అమాంతం పెరిగిపోతాయని,వంటగ్యాస్ కొరత మూలంగా ఆహార లభ్యత మొదలు ఉపాధి వరకు వివిధ రూపాల్లో సమాజంపై దుష్ప్రభావం పడుతుందని అన్నారు. ఇప్పటికే గృహ వినియోగదారులు సిలిండర్ కోసం బుక్ చేస్తుంటే తగిన స్పందన ఉండడం లేదని. ఇంతకుముందు బుక్ చేసిన వారికి కూడా ఐదారు రోజులైనా గ్యాస్ బండ రావడం లేదని ఇళ్లలో, మార్కెట్లలో గ్యాస్ కొరత రాకుండా బ్లాక్ మార్కెట్ను అరికట్టేందుకు ప్రభుత్వం వెంటనే తగు చర్యలు చేపట్టాలని,బ్లాక్ మార్కెటింగ్కు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలనంతరం పెట్రోలు, డీజిల్ ధరలు కూడా పెరుగుతాయని వార్తలు వస్తున్నాయని దాంతో సరుకు రవాణా, ప్రజా రవాణా కూడా భారమవుతాయని తెలిపారు. ఈ పరిస్థితికి కేంద్ర ప్రభుత్వం యుద్ధాన్ని సాకుగా చూపుతోంది. ఇరాన్ పై యుద్ధానికి తెగబడింది, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు మూల కారణం ముమ్మాటికి అమెరికా ఇజ్రాయిల్ లే! అటు ట్రంప్, ఇటు నెతన్యాహు తనకు అనుంగు మిత్రులని చెప్పే ప్రధాని నరేంద్ర మోడీ వినాశకరమైన యుద్ధం నిలుపుదల చేయడానికి వెంటనే కృషి చేయాలని. కేంద్ర ప్రభుత్వాన్ని అన్ని విధాల కాపాడుతున్న తెలుగుదేశం పార్టీ తన పలుకుబడిని వినియోగించి ప్రధానిపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నాగరాజు మధు తిమ్మరాజు రమేష్ అంజి ఓబులేష్ బాబు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఏళ్ల సమస్యకు.. 8నెలల్లో పరిష్కారం
## ఎట్టకేలకు రాప్తాడు రైల్వే బ్రిడ్జి ప్రారంభం

- ఎమ్మెల్యే పరిటాల సునీత చొరవతో బ్రిడ్జి నిర్మాణం పూర్తి
- ఆట్టహాసంగా బ్రిడ్జి ప్రారంభోత్సవం భారీగా పాల్గొన్న ప్రజలు
- బ్రిడ్జిని పరిశీలించిన ఎమ్మెల్యే సునీత,పరిటాల శ్రీరామ్
- బ్రిడ్జ్ పై రోడ్డు బాగా ఉందని అతివేగంగా వెళ్లవద్దని ఎమ్మెల్యే సునీత సూచన





**రాప్తాడు,మార్చి15.అక్షర టైమ్స్:** గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో మంజూరై పనులు ప్రారంభించిన అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వ హయాంలో కమిషన్ల కోసం ఆగిపోయిన రాప్తాడు ఫోర్ లైన్ రైల్వే బ్రిడ్జిని కేవలం 8నెలలలోపే పూర్తి చేశామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. గత కొన్ని ఏళ్లుగా లక్షలాది మంది ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగులు, వాహనదారులను ఇబ్బంది పెడుతున్న రాప్తాడు ఫోర్ లైన్ రైల్వే బ్రిడ్జి ఎట్టకేలకు పూర్తైంది. ఆదివారం బ్రిడ్జి ప్రారంభోత్సవం ఆట్టహాసంగా సాగింది. ముందుగా బ్రిడ్జిని ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఆతర్వాత భారీగా పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు నడుమ పూజలు నిర్వహించి బ్రిడ్జిని ఎమ్మెల్యే సునీత ప్రారంభించారు. ఒక పండుగ వాతావరణంలో బ్రిడ్జి ప్రారంభోత్సవం జరిగింది. ఎమ్మెల్యే సునీత స్వయంగా బ్రిడ్జిపై ప్రదర్శనగా వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో 2017లో 74కోట్ల రూపాయలతో బ్రిడ్జి మంజూరైందన్నారు. 1.8కిలోమీటర్ల మేర 42 మరియు 44వ జాతీయ రహదారులను కలపడంతో పాటు బెంగళూరు, హిందూపురం, పెనుగొండ, మడకశిర, పావగడ, రాప్తాడు నియోజకవర్గాల ప్రజలు అనంతపురం పట్టణంలోకి రావడానికి మరియు బళ్లారి, గుత్తి, రాప్తాడు వైపుల నుంచి వచ్చే వాహనాలు తిరుపతి, చెన్నై వెళ్లడానికి ఈ బ్రిడ్జి ఉపయోగపడేలా ప్లాన్ చేశారన్నారు. రైలు వచ్చే సమయంలో గేటు వేసినప్పుడు వాహనదారులు ఎక్కువసేపు నిరీక్షించే పరిస్థితి ఉండేదన్నారు. అత్యవసర వైద్య చికిత్సల కోసం వచ్చేవారు మరియు విద్యార్థులు, ఆఫీస్ లకు వెళ్లే ఉద్యోగులు చాలా ఇబ్బందులు ఎదుర్కొనేవారన్నారు. 2017లో పనులు ప్రారంభించగా.. 55కోట్ల నిధులతో తమిళనాడుకు చెందిన ఒక కాంట్రాక్టర్ ఒప్పందం చేసుకొని ఈ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించారన్నారు. అయితే 70శాతం పనులు పూర్తి అయ్యాక.. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వంలో ఈ పనులు ఆగిపోయాయన్నారు. ఆ కాంట్రాక్టర్ మిగిలిన పనులను పూర్తి చేయనందున పనులను రద్దు చేశారన్నారు. ఇలాంటి సమయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఒప్పించి 25 కోట్ల రూపాయలు నిధులు తీసుకొచ్చామన్నారు. ఎస్కేసీ కాంట్రాక్టర్లు కేవలం 8నెలల్లో పై బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేశారన్నారు. ప్రస్తుతం ఈ బ్రిడ్జి నిర్మాణం వల్ల బెంగళూరు-చెన్నై-హైదరాబాద్ మూడు రహదారులను కలిపే విధంగా ఉంటుందని.. ఈ మార్గంలో ప్రయాణించే వారికి ఇక కష్టాలు ఉండవన్నారు. దాదాపు ఈ బ్రిడ్జి వలన ఏళ్లపాటు నాతో సహా ఎంతో మంది ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారన్నారు. ఈ బ్రిడ్జి అనుకున్న సమయానికన్నా ముందే పూర్తిచేసిన కాంట్రాక్టర్లను ఎమ్మెల్యే సునీత కృతజ్ఞతలు తెలిపి అభినందించారు. రోడ్డు బాగా ఉందని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, బ్రిడ్జిపై అతివేగంగా వెళ్లవద్దని, ఎమ్మెల్యే సునీత ప్రయాణికులకు, వాహనదారులకు సూచించారు. ఇంకా రాప్తాడు పరిసర ప్రాంతాల్లో ఉన్న అనేక పనులను కూడా త్వరలోనే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.



## మడకశిరలో డ్రగ్స్, హెల్మెట్ అవగాహన కార్యక్రమం

**మడకశిర,మార్చి15.అక్షర టైమ్స్:**–(మడకశిర ఇంచార్జ్) మడకశిర పట్టణంలో నేడే సోమవారం మధ్యాహ్నం 3.00 గంటలకు అంబేద్కర్ సర్కిల్ నుండి మహాత్మా జ్యోతిబాపూలే సర్కిల్ (అమరాపురం బస్టాండ్) వరకు హెల్మెట్ అవగాహన బైక్ ర్యాలీ నిర్వహించబడుతుంది.అనంతరం సాయంత్రం 3.30 గంటలకు అదే ప్రాంగణంలో "డ్రగ్స్ వాడకం వల్ల కలిగే దుష్ఫలితాలు, హెల్మెట్ వాడకపోవడం వల్ల జరిగే నష్టాలు" అనే అంశంపై అవగాహన సదస్సు జరుగనుంది. ఈ కార్యక్రమాన్ని మడకశిర శాసనసభ్యులు, టి.టి.డి బోర్డు సభ్యులు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎం.ఎస్. రాజు మరియు మాజీ శాసన మండలి సభ్యులు, టి.డి.పి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ముఖ్య అతిథులు శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్, ఐ.ఏ.ఎస్., జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, ఐ.పి.ఎస్., ప్రముఖ సినీ నటుడు విష్ణు, ప్రముఖ సినీ నటి అనన్య నాగళ్ల, సినీ నటుడు కారుమంచి రఘు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. మడకశిర నియోజకవర్గంలోని యువకులు, విద్యార్థులు, మహిళలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు. బైక్ ర్యాలీకి ద్విచక్రవాహనంతో పాటు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి రావాలని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు.

## నూతన వదువరులు మౌనిష్ వెడ్స్ రాఘవి ఆశీర్వదించిన ఎమ్మెల్యే అమిలినేనిసురేంద్ర

- ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు జయం విశ్వనాథ్



**కళ్యాణదుర్గం,మార్చి15.అక్షర టైమ్స్:** అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జయం విశ్వనాథ్ ఆహ్వానం మేరకు శ్రీ వాసవి కళ్యాణమంటపంలో జరిగిన వారి కుమారుడు మౌనీష్ వెడ్స్ రాఘవిల వివాహ రిసెప్షన్ కు స్థానిక టీడీపీ నాయకులతో కలసి పాల్గొని నూతన వదువరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు . ఈ కార్యక్రమమునకు పట్టణంలో ప్రముఖులు ఆర్యవైశ్యులు నాయకులు అన్ని పార్టీ ల రాజకీయ నాయకులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు

## రైతు సేవా కేంద్రాల్లో పంట నమోదు జాబితా ప్రదర్శన



**బుక్కరాయసముద్రం,మార్చి15.అక్షర టైమ్స్:** రైతు సేవా కేంద్రాల్లో పంట నమోదు జాబితా ప్రదర్శన.... రబి సీజన్లో రైతు సోదరులు సాగుచేసిన పంటలను అనగా వేరుశనగ, మొక్కజొన్న,పప్పు శనగ, వరి మరియు ఇతర పంటలను డిజిటల్ పద్ధతిలో ఈ కర్షక్ అప్లికేషన్లో నమోదు చేసిన జాబితాలను రైతు సేవా కేంద్రాలలో ప్రదర్శించడం అయినది రైతు సోదరులు జాబితాలను చూసి సరి చేసుకోవాల్సిందిగా కోరడమైనది ఈ జాబితా రైతు సోదరులకు పంట ఉత్పత్తులను మద్దతు ధరకు అమ్ముకొనడానికి మరియు ఇన్పుట్ సబ్సిడీ తదితర వాటికి ఉపయోగపడుతుందని కావున రైతు సోదరులు తమ యొక్క ఖాతా నెంబరు సర్వే నెంబరు మరియు వేసిన పంటను సరిచూసుకోవాల్సిందిగా కోరడమైనది.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం సోదరులు గుమ్మనూరు శ్రీనివాసులు



**గుంతకల్,మార్చి15.అక్షర టైమ్స్:**–(గుమ్మనూరు హరి) యాడికి మండలం కుందనకోట గ్రామానికి చెందిన హరి ప్రత్యేక ఆహ్వానం మేరకు వారి వివాహానికి ముఖ్య అతిథులుగా శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం సోదరులు గుమ్మనూరు శ్రీనివాసులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఛాయపురం చంద్ర, ప్రకాష్ రెడ్డి, బండారు శివ,బెస్త శివశంఖర్,రాము స్వామి, బోయ మధు,జీవన్ కుమార్,మద్దిలేటి సోముశేఖర్, కూటమి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గుమ్మనూరు ఫ్యామిలీ అభిమానులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి అండగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, గుమ్మనూరు ఈశ్వర్



**గుంతకల్,మార్చ్15.అక్షర టైమ్స్:**–(ప్రతినిధి గుమ్మనూరు హరి) శాసన సభ్యులు గుమ్మనూరు జయరాం ఆయన తనయుడు యువనేత పామిడి గుత్తి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ వారి స్వగృహం నందు అనుంపల్లి గ్రామ టీడీపీ నాయకులు కలిసి ఇటీవల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వెంకటేష్ కోడలు ప్రమాదవ శాత్తు హాస్పిటల్ నందు చికిత్స పొందుతూ దాదాపుగా 16లక్షల రూపాయలు ఖర్చు పెట్టినప్పటికి దురదృష్టవ శాత్తుఆరోగ్యం విషమించి ఆమే మరణించడం జరిగింది.ఈసందర్భంగా ఆదివారం అనుంపల్లి గ్రామ టీడీపీ నాయకులు వెంకటేష్ కుమారుడు తిరుపతయ్య తో కలిసి ఎమ్మెల్యేతో కలిసి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరడం జరిగింది. స్పందించిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం వారి తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ సంబంధిత బిల్లులు అన్నీ పరిశీలించి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా తిరుపతయ్య కుటుంబానికి అండగా ఉంటామని ప్రభుత్వం తరపున కచ్చితంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

## భారతీయ జనతా పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న కాపు రామచంద్రారెడ్డి



**రాయదుర్గం,మార్చ్15.అక్షర టైమ్స్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని విజయవాడలోని ఐవి ప్యాలెస్లో నిర్వహించిన భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) రాష్ట్ర కార్యశాలలోపాల్గొన్న రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు కాపు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హిమాచల్ ప్రదేశ్ ఇన్చార్జి మరియు ఉత్తరప్రదేశ్ మథుర శాసనసభ్యులు శ్రీకాంత్ శర్మ పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్ మాధవ్,రాష్ట్ర మంత్రి శ్రీసత్యకుమార్ యాదవ్ , రాజమండ్రి పార్లమెంట్ సభ్యులు పురందేశ్వరి , దినకర్ జీ , శాసనసభ్యులు విష్ణు కుమార్ రాజు , శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి , శాసనసభ్యులు పార్థసారథి , ఎం.ఎల్.సి. సోము వీర్రాజు , శాసనసభ్యులు ఈశ్వరరావు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా నుంచి జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్ , రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవానంద్ ,డి వెంకటేష్ రెడ్డి, రాయదుర్గం నుంచి జి.వి. నాయుడు (నాని) , కళ్యాణదుర్గం నుంచి దేవరాజు, అనంతపురం నుంచి ఈశ్వర్ ప్రసాద్, గుంతకల్లు నుంచి కొలిమి రామాంజనేయులు మరియు అనంతపురం జిల్లా ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు





**డి.హిరేహాల్,మార్చ్15.అక్షర టైమ్స్:** రాయలసీమ బిడ్డనని చెప్పుకునే జగన్ మోహన్ రెడ్డి ఐదు సంవత్సరాల వైసిపి పాలనలో రాయలసీమ గ్రామాలకు తీరని ద్రోహం చేశారని,రాయలసీమ నుండి జగన్మోహన్ రెడ్డిని బహిష్కరించాలని ప్రభుత్వ విప్ రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గం నెమకల్లు గ్రామంలో పర్యటనలో భాగంగా ఇచ్చిన హామీ మేరకు రాయదుర్గం నియోజకవర్గానికి రూ.390 కోట్లు జల్ జీవన్ మిషన్ కింద నిధులు మంజూరుకి రాష్ట్ర క్యాబినెట్లో ఆమోదం పొందడంతో. డి. హీరేహాల్ మండలంలో కృతజ్ఞత సభ ఏర్పాటు చేశారు. ఇ కార్యక్రమనికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు హాజరయ్యారు. నేపథ్యంలో ఆయన కూటమి శ్రేణులతో కలిసి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ పథకం ద్వారా ప్రతి గ్రామానికి స్వచ్ఛమైన త్రాగు నీరు అందించడంతోపాటు , ఇంటికో కొళాయి ఏర్పాటు చేయనున్నారు. జల జీవన్ మిషన్ ద్వారా 390 కోట్లు మంజూరు చేసినందుకు సీఎం చంద్రబాబు నాయుడుకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పాదాభివందనం చేస్తున్నానన్నారు. రాయదుర్గం నియోజకవర్గం పల్లె ప్రజలు 30 సంవత్సరాలు పాటు నీటి సమస్య లేకుండా సురక్షితమైన మంచినీళ్లు పొందే విధంగా జల జీవన్ మిషన్ ద్వారా అమలవుతుందన్నారు.

## రైతు సంఘం నాయకుడు మృతి



**గాండ్లపెంట,మార్చి15.అక్షర టైమ్స్:** మండల పరిధిలోని తూపల్లికి చెందిన ఖాదర్ భాష 70 అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు రాజారెడ్డి నాయకులు వెళ్లి మృతదేహాన్ని నివాళులర్పించారు కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని తెలిపారు రైతు కోసం ఎన్నో పోరాటాలు చేశాడని కొనియాడారు

## పరిశీలిస్తున్న మండల అధికారులు అభ్యాసకులకు పరీక్షలు



**గాండ్లపెంట,మార్చి15.అక్షర టైమ్స్:** అక్షర ఆంధ్రాలో భాగంగా అభ్యాసకులకు ఫైనల్ పరీక్షలు ఆదివారం నిర్వహించిన మండల వ్యాప్తంగా 191 కేంద్రాలలో 1906 మంది అభ్యాసకులు పరీక్షలు రాశారు 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు పరీక్ష కేంద్రాలకు ఎంపీడీవో రామకృష్ణ డిప్యూటీ ఎంపీడీవో పద్మనాభ రెడ్డి ఏపీ ఏశీ సూర్యనారాయణ పరిశీలించారు నిరక్షరాశులకు అక్షరాసులుగా మార్చాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు అధికారులు వివరించారు

## విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ చేసిన కలెక్టర్ శ్యాం ప్రసాద్

- జిల్లాలో ఉత్తమ ఫలితాలు సాధించాలి






**పుట్టపర్తి,మార్చి15.అక్షర టైమ్స్:** ఎస్ఎస్సీ మార్చి--2026 పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ పరీక్షా సామాగ్రిని పంపిణీ చేశారు. పుట్టపర్తిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు, పెన్నులు అందజేశారు.ఈ సందర్భంగా విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖిగా మాట్లాడి వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. తాను ఈ పాఠశాలను దత్తత తీసుకున్నందున విద్యార్థులందరూ క్రమశిక్షణతో చదివి మంచి ఫలితాలు సాధించి పాఠశాల పేరు నిలబెట్టాలని కోరారు. జిల్లాలోనే అగ్రస్థానాల్లో నిలిచేలా కృషి చేయాలని సూచించారు. పరీక్షా ఫలితాలు వెలువడిన అనంతరం పాఠశాలను మరొకసారి సందర్శించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందజేస్తానని హామీ ఇచ్చారు.జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ పరీక్షల సమయంలో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ముఖ్యంగా ప్రశ్నాపత్రాన్ని జాగ్రత్తగా చదివి అర్థం చేసుకోవడం, సమయపాలన పాటిస్తూ సమాధానాలను సక్రమంగా రాయడం, ఒత్తిడికి లోనవకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయడం వంటి అంశాలపై సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చిన టూటౌన్ సీఐ రెడ్డప్ప



**ధర్మవరం,మార్చి15.అక్షర టైమ్స్:** పట్టణంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల రౌడీ షీటర్లకు పోలీస్ స్టేషన్లో టూ టౌన్ సీఐ కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది. రౌడీలతో వారు మాట్లాడుతూ ఎవరైనా సంఘ వ్యతిరేక పనులు చేసినా, గ్యాంబ్లింగ్, మట్కా లాంటి అసాంఘిక నేరాలకు పాల్పడిన, దౌర్జన్యాలు చేసిన, కబ్జాలకు పాల్పడిన వ్యక్తులపైన చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామని వారు స్పష్టం చేశారు. చెత్త పరిధిలోనే జీవించేలా తమ యొక్క అలవాట్లను మార్చుకొని మంచి మార్గంలో వెళ్లాలని గట్టిగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## భయపడకుండా పదవ తరగతి విద్యార్థులు పరీక్షలు రాయండి

- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి



**ధర్మవరం,మార్చి15.అక్షర టైమ్స్:** పట్టణంలోని పది పరీక్షా కేంద్రాలలో పదవ తరగతి విద్యార్థులు భయపడకుండా, ధైర్యంగా పరీక్షలు రాయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్, ఉమ్మడి జిల్లా బాస్కెట్బాల్ అసోసియేషన్ అసోసియేట్ కార్యదర్శి శెట్టిపి జై చంద్రారెడ్డి తెలిపారు. మాట్లాడుతూ యుటిఎఫ్ తరుణ్ తరపున తొలుత విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పరిషకు కావలసిన హాల్ టికెట్ పెన్సిలు స్కేలు తదితర సామాగ్రి తప్పకుండా తీసుకొని వెళ్లాలని, పరీక్షా హాలుకు అర్ధగంట ముందుగా చేరుకోవాలని, పరిశాపత్రం ఒకటికి రెండుసార్లు చదువుకొని, తెలిసిన ప్రశ్నలకు ముందుగా జవాబులు రాయాలని తెలిపారు. ప్రతి జవాబుకు ప్రశ్న నెంబర్ తప్పక రాయాలని తెలిపారు. కొట్టివేతలు లేకుండా అందంగా రాత ఉండేటట్లు తగిన జాగ్రత్తలు వహించాలన్నారు. పరీక్షా కేంద్రాలలో ఉన్న ఇన్విజిలేటర్లు కూడా విద్యార్థులకు ధైర్యాన్ని ఇస్తూ ప్రోత్సహించాలన్నారు. విద్యాశాఖ కూడా పరీక్షలు పారదర్శకంగా జరగడానికి పూర్తి స్థాయిలో సహకారం అందించాలని తెలిపారు.

## పుట్టపర్తిలో పోలీసుల కార్డన్ సెర్చ్ - 47 ద్విచక్ర వాహనాలు సీజ్



**పుట్టపర్తి,మార్చి15.అక్షర టైమ్స్:** శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తిలో డీఎస్పీ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు "ఆపరేషన్ వజ్రప్రహార్"లో భాగంగా ఆదివారం ఉదయం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. చిత్రావతిగుట్ట, పెద్దబజారు, సాయి నగర్, కర్ణాటక నాగేపల్లి తదితర ప్రాంతాల్లో సుమారు 55 మంది పోలీసు సిబ్బందితో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ప్రతి ఇంటిని, పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పాత నేరస్తులకు డీఎస్పీ విజయ్ కుమార్ కౌన్సిలింగ్ ఇచ్చారు. సరైన పత్రాలు లేని 47 ద్విచక్ర వాహనాలను పోలీసులు సీజ్ చేశారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నేరగాళ్ల కదలికలను గుర్తించేందుకు ఈ తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. డ్రోన్ కెమెరాల సహాయంతో మారుమూల ప్రాంతాల్లో కూడా తనిఖీలు చేపట్టామని చెప్పారు. రౌడీ షీటర్లు, అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లు, ఖాళీ భవనాలు, నిర్మానుష్య ప్రాంతాలను డ్రోన్ల ద్వారా వీడియో రికార్డింగ్ చేస్తూ తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించామని పేర్కొన్నారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని తెలిపారు. ఎవరైనా గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే ఏపీ ఈగిల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972కు తెలియజేయాలని ప్రజలను కోరారు.

## ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు



**అనంతపురం,మార్చి15.అక్షర టైమ్స్:** అనంతపురం రూరల్ పరిధిలోని సిండికేట్నగర్లో గల మజీద్ ఏ అబ్దుల్ ఖాదర్లో ఆదివారం ఉపవాస దీక్ష ఉన్న ముస్లిం సోదరులకు వైఎసఆర్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం అనంతపురం నగర ఉపాధ్యక్షులు ఆలూరు మహ్మద్ ఆసిఫ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహ్మద్ ఆసిఫ్ మాట్లాడుతూ.. రంజాన్ మాసం అత్యంత ప్రత్యేకమైందని, ఈ మాసంలో చేసే ప్రతి పుణ్యకార్యం యొక్క ఫలితం అధికంగా లభిస్తుందన్నారు. దాన ధర్మాల ద్వారా పేదలకు తమవంతు సహకారాన్ని అందించడం ఎంతో గొప్ప కార్యమన్నారు. అనంతరం ముస్లిం సోదరులతో కలిసి నమాజ్ చేశారు. ఉపవాస దీక్ష విరమించిన వారితోపాటు ఆయన విందులో పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరిలోనూ సేవాగుణం, క్రమశిక్షణ ఉండాలి

- అదే రంజాన్ మాసం తెలియజేసే సారాంశం
- ఇఫ్తార్ విందు సందర్భంగా ధర్మవరం టిడిపి ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్
- ధర్మవరం జామియా మసీదులో ఇఫ్తార్ విందు
- టిడిపి నాయకుల్ని అభినందించిన పరిటాల శ్రీరామ్



**ధర్మవరం,మార్చి15.అక్షర టైమ్స్:** ప్రతి ఒక్కరిలోనూ క్రమశిక్షణ, సేవా గుణం ఉండాలని.. రంజాన్ మాసం తెలియజేసే సారాంశం అదేనని ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్ ఛార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. ధర్మవరం పట్టణంలోని జామియా మసీదులో జరిగిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. టీడీపీ ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షుడు అస్లాం నడిమ్ మసీద్, షామీర్ నడిమ్ మసీద్ ఆధ్వర్యంలో ఈ ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నగరంలోని ముస్లిం మైనార్టీలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముస్లిం సోదరులతో కలిసి శ్రీరామ్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆయన ప్రతి ఒక్కరికి స్వయంగా భోజనం వడ్డించారు. శ్రీరామ్ మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ మాసంలో ముస్లింలు ఎంతో కఠోరమైన ఉపవాస దీక్షలు చేస్తుంటారన్నారు. ఆకలి విలువ, అలాగే భోజనం విలువ తెలిసే విధంగా ఈ ఉపవాస దీక్షలు ఉంటాయన్నారు. రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరు ఎక్కడో ఒక చోట సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. టిడిపి నాయకులు కూడా చాలా చోట్ల ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని... సేవా గుణం చాటుకుంటున్న వారందరిని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు. ధర్మవరంలో మతసామరస్యానికి ప్రతీకగా ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి పండుగలు నిర్వహించుకుంటారన్నారు. తెలుగుదేశం పార్టీ మైనార్టీల పక్షపాతిగా పనిచేస్తోందని.. ఇప్పటికే వారికి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని శ్రీరామ్ అన్నారు.

## పాడైపోయిన బోర్ మోటారు రిపేర్ చేపించిన

- సర్పంచ్ పంచరత్నమ్మ
- ఈవోఆర్ డి బాబురావు
- సెక్రటరీలు నరేష్ కుమార్
- శ్రీనాథ్ రెడ్డి



**నల్లచెరువు,మార్చి15.అక్షర టైమ్స్:** సత్యసాయి జిల్లా నల్లచెరువు మండల కేంద్రంలో శ్రీ ఎల్లమ్మ స్వామి వీధి నందు కొత్త చేదబావి దగ్గర బోర్ మోటారు పాడైపోయినందున విషయం తెలుసుకున్న సర్పంచ్ పంచరత్నమ్మ ,ఈవోఆర్ డి బాబురావు, సెక్రటరీలు నరేష్ కుమార్, శ్రీనాథ్ రెడ్డి కొత్త మోటర్ ఏర్పాటు చేసి నీటి సమస్యను పరిష్కరించారు.పండుగ సమయంలో కొత్త మోటారు బిగించినందుకు వార్డు మెంబర్లు రెడ్డప్ప,తేజ, మెకానిక్ మురళి,వే మయ్య, కృష్ణ, నారాయణప్ప, నరసింహులు, వినోద్, హసన్, పీరా, లక్ష్మన్న, ఆంజనేయులు, డి నరసింహులు, హుస్సేన్, మోహన్, వేమనారి కాలనీవాసులందరూ సంతోషం వ్యక్తం చేశారు.

# పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు మెరుగుపర్చాలి


- బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సోమల ప్రకాష్ నాయుడు
- మార్చి16 నుంచి ప్రారంభమయ్యే 10వ తరగతి పరీక్షలకు జిల్లాలో 22,303 మంది విద్యార్థులు హాజరు -- వేసవి వేడిమి దృష్ట్యా తాగునీరు, వైద్య సదుపాయాలు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి



**ముదిగుబ్బ,మార్చి15.అక్షర టైమ్స్:** సత్యసాయి జిల్లాలో మార్చి 16 నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులను మెరుగుపర్చాలని భారతీయ జనతా పార్టీ సత్యసాయి జిల్లా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సోమల ప్రకాష్ నాయుడు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 22,303 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో పరీక్షలు జరిగే ప్రతి కేంద్రంలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు సమృద్ధిగా ఉండేలా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. వేసవి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో పరీక్షలు రాసే విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా చూడటం ప్రభుత్వ బాధ్యత అని ఆయన అన్నారు. ముఖ్యంగా పరీక్షా కేంద్రాల్లో తాగునీటి సదుపాయం, చల్లని నీరు, ఓఆర్ఎస్ పాకెట్లు, ఫ్యాన్లు, ప్రథమ చికిత్స (ఫస్ట్ ఎయిడ్) సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఎండ వేడిమి కారణంగా అలసటకు గురికాకుండా కేంద్రాల్లో తగిన గాలి ప్రసరణ ఉండేలా చూడాలని అధికారులను కోరారు. అదేవిధంగా పరీక్షా కేంద్రాల వద్ద వైద్య సిబ్బంది లేదా ఆరోగ్య కార్యకర్తలను అందుబాటులో ఉంచాలని, అవసరమైతే వెంటనే వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ పరీక్షల నిర్వహణ జరగాలని అన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, పరీక్షా కేంద్రాల పరిసరాల్లో శబ్ద కాలుష్యం లేకుండా చూడాలని కూడా ఆయన పేర్కొన్నారు. ట్రాఫిక్ సమస్యలు లేకుండా విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా పోలీస్ శాఖ కూడా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా విద్యాశాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని, కేంద్రాలను ముందుగానే పరిశీలించి అవసరమైన మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పరీక్షల నిర్వహణలో చిన్న లోపం జరిగినా అది విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపే అవకాశం ఉందని, అందువల్ల అధికారులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని అన్నారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే స్పందించి అన్ని పరీక్షా కేంద్రాల్లో తగిన మౌలిక వసతులు కల్పించాలని, విద్యార్థులు ఎలాంటి ఒత్తిడిలేకుండా పరీక్షలు రాసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ అంశంపై ప్రభుత్వం త్వరగా స్పందించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కూడా ఆశిస్తున్నారని తెలిపారు.

# వావ్.. ఆమె ఫుల్ ఖుషీ





కాలం ఎంత మారినా.. నేటికీ అతివ గడప దాటాలంటే తల్లిదండ్రుల అనుమతి కావాలి. భర్త తోడుగా ఉంటేనే విహారయాత్ర! కుటుంబం వెంట ఉంటే తీర్థయాత్ర! అంతేకానీ, ఆమె తన స్నేహితులతో ఊరు దాటడమూ గగనమే! ఇలాంటి ఒంటరిగా విహారయాత్రలకు వెళ్లే ఆడవాళ్లు సాహస వనితల్లాగానే కనిపిస్తారు. కుటుంబ సమేతంగా పర్యాటక ప్రాంతాలు చుట్టిరావడం తప్ప.. ఫ్యామిలీ లేకుండా విహరించాలనే ఆలోచన కూడా చాలామంది మహిళలకు రాదు! కానీ, సుమిత్ర సేనాపతి రంగప్రవేశం తర్వాత సీన్ మారింది. మగువలంతా మనసైన పర్యటనలకు సై అంటున్నారు. ఆమె ప్రారంభించిన 'వావ్ క్లబ్'తో గుంపులు గుంపులుగా అతివలంతా విహార యాత్రలకు వెళ్తొస్తున్నారు. సోలో పర్యటనలూ చేస్తూ ఫుల్ ఖుషీ అవుతున్నారు. ప్రపంచాన్ని చూసి రావాలనే కోరికతో ఉన్న మహిళల కోరిక నెరవేరాలంటే చాలా ఆటంకాలు దాటాలి. ప్రయాణ మార్గంలో ఎన్నో ఎత్తుపల్లాలు ఉంటాయి. చదును చేసి రహదారి వేస్తే జర్నీ సాఫీగా సాగిపోతుంది. లోతైన నదులను వారధులు దాటిస్తాయి. అలాగే ట్రావెల్ చేయాలనుకునే మహిళలకూ ఎదురయ్యే అవరోధాలను వావ్ క్లబ్ దాటిస్తుంది. మహిళలు ఒంటరిగా ప్రయాణం చేయలేని పరిస్థితులు. భద్రతకు భరోసా లేకపోవడం, మగతోడు ఉంటేనే ట్రావెల్ అనే పాత మాటలు కట్టిపెట్టి, చేయిచేయి కలిపి సాహస యాత్రలు చేసొద్దామని వావ్ క్లబ్ కొత్త హామీ ఇస్తున్నది. 2005లో సుమిత్ర సేనాపతి ఈ క్లబ్‌ను ప్రారంభించారు. ఇరవై ఏళ్లుగా వేల సంఖ్యలో మహిళా బృందాలకు కొత్త ప్రపంచాన్ని చూపిస్తున్నారు. సాధారణ ట్రావెల్ ఏజెన్సీ ద్వారా కూడా మహిళలు పర్యటనకు సిద్ధం కావొచ్చు. కానీ, ఆ బృందంలో ఉండే మగవాళ్లతో సమస్యలు రావొచ్చనే భయం. పదిమంది పురుషుల మధ్య నలుగురు మహిళలు ప్రయాణం అంటే ఆలోచించాల్సిందే! ఇక కుటుంబ సభ్యులు లేకుండా ప్రయాణం అంటే ఆగిపోవాల్సిందే! ఇలాంటి పరిస్థితులు ఎదుర్కొంటున్న మహిళలు వావ్ క్లబ్‌ని ఎంచుకుంటే ప్రపంచంలోని 52 అద్భుతమైన పర్యాటక ప్రదేశాలకు తేలిగ్గా వెళ్లి, సంతోషంగా చూసి రావొచ్చు.

### లీడ్ టు వండర్ వరల్డ్

ట్రావెలర్‌గా ఎన్నో దేశాలు చూసొచ్చిన సుమిత్ర సేనాపతికి ప్రపంచ పర్యాటకం కొట్టిన పిండి. ప్రపంచాన్ని చుట్టి రావడం కోసం 50 పర్యాటక ప్రదేశాలతో నెట్‌వర్క్‌ని ఏర్పాటు చేసుకుని ఆమె వావ్ క్లబ్‌ని నిర్వహిస్తున్నారు. లడఖ్ ప్రాంతంలో ఎత్తయిన పర్వతాల మధ్య ఉన్న లేహ్‌లో విమానం దిగి 'ఆడవాళ్లం ఎక్కడికైనా వెళ్తొస్తాం. ఏదైనా చూసొస్తాం' అని చాటే ప్రయాణం 2005లో మొదలైంది. ఇక అప్పటినుంచి ఆమె ఆగింది లేదు. ఏడాది తర్వాత విదేశీ విహారాలు మొదలుపెట్టారు. ఈజిప్ట్‌లో దిగి నైలు నది నాగరికత వెంట నడిచివచ్చారు. మూడో ఏడాదిలో ఆనందాల రాజ్యం భూటాన్‌కు బయలుదేరారు. పులుల అభయారణ్యంలో విహరించారు. సుమిత్ర నాయకత్వంలో ఆసియా, ఆఫ్రికా, ఐరోపాతోపాటు మంచు ఖండం అంటార్కిటికానూ మహిళలు చుట్టొచ్చారు. మగవాళ్ల తోడు, సహకారం లేకుండా మహిళల నిర్వహణ, మహిళల మార్గదర్శనంలో సంతోషంగా విహరించడం విదేశీ పర్యాటకులకూ ఆశ్చర్యం కలిగిస్తున్నది.

### ట్రావెల్ ఫ్రెండ్‌షిప్

సుమిత్రకు పర్యాటక ప్రాంతాల ఆనుపానులే కాదు చారిత్రక విశేషాలు, సాంస్కృతిక ప్రత్యేకతలన్నీ తెలుసు. ఆ విశేషాలను చెబుతూ ఆమె తనతో వచ్చిన మహిళలనూ నడిపిస్తున్నారు. ఇలా వావ్ క్లబ్ ద్వారా ట్రావెల్ చేసే మహిళలు జోధ్‌పూర్ సూఫీ ఫెస్టివల్‌ని ఎంజాయ్ చేసి, వియత్నాంలో విందారగించి, బోర్డెక్స్ (ఫ్రాన్స్)లో వైన్ సేవించి, అర్జెంటీనాలో టాంగో డ్యాన్స్ ఆడి.. భారత్‌కు వస్తారు. సీజన్ సీజన్‌కు పర్యాటక ప్రాంతాలు మారతాయి. సీజన్‌కి తగ్గ ఫెస్టివల్స్, ఆహారం, మరెన్నో విశేషాలు తెలుసుకుని వాటిని చేరుకునే తారీఖుల్లో ప్రయాణాలు చేస్తుంటారు. విహార పర్వంలో సాంస్కృతిక పర్యాటకం ఎక్కువమందిని ఆకట్టుకుంటుంది. ఈ మహిళల బృందం ఆయా దేశాల్లో మహిళల అలంకరణ, కట్టుబొట్టుని చూసిరాదు. వాళ్ల ఆహార్యాన్ని ధరించి వస్తుంది. పర్యటనకు వచ్చిన మహిళలు కుటుంబాలకు దూరంగా ఉన్నామనే భావన రాకుండా యాత్రికులంతా ఒక కుటుబంలా కలిసిపోయేలా ఎన్నో ప్రత్యేకమైన కార్యక్రమాలను వావ్ క్లబ్ నిర్వహిస్తుంది. మహిళలకు ఉండే అభిరుచులను బట్టి మహిళలే ఇవి నిర్వహించడం వల్ల వాళ్ల మధ్య స్నేహభావమూ పెరుగుతుంది. వావ్ క్లబ్‌లో చేరడం వల్ల పర్యాటకం పట్ల ఆసక్తి ఉన్న మహిళలతో కలిసి ప్రపంచాన్ని చుట్టి రావడమే కాకుండా తోటి ట్రావెలర్స్‌తో స్నేహం ఏర్పడుతుంది. ఆ స్నేహంతో భవిష్యత్‌లోనూ మళ్లీ మళ్లీ వావ్ క్లబ్ ద్వారా కలుసుకుని మరికొన్ని రోజులు మరో ప్రాంతానికి వెళ్తుంటారు. తమ పర్యటన ఇంట్లో వాళ్లకు భారం కాకుండా మళ్లీ ట్రావెల్ చేయదలుచుకున్న మహిళలు ఈ వావ్ క్లబ్‌తో కొనసాగుతున్నారు. పర్యాటక బృందాలనే కాదు సోలో ట్రావెల్‌ని కూడా వావ్ క్లబ్ నిర్వహిస్తున్నది. ఒంటరిగా ప్రకృతి అందాలను చూసిరావాలనుకునే మహిళల భద్రతకు కావాల్సిన ఏర్పాట్లు, జాగ్రత్తలన్నీ సంస్థే చూసుకుంటుంది. టూర్ డిజైన్, ట్రావెల్, హాస్పిటాలిటీ అంతా వాళ్ల బాధ్యతే! మొత్తంగా మహిళల్లో నిద్రాణమై ఉన్న విహార వాంఛను తట్టి లేపడమే కాదు, మది కోరిన మధుసీమలను చుట్టివచ్చేలా వావ్ క్లబ్ చేస్తున్నది కదూ!

# రాళ్లపల్లి పంచాయతీ గ్రామాల్లో వెలుగులు నింపిన వీధి దీపాల కార్యక్రమం

- ఎమ్మెల్యే ఆదేశాలపై చీకటిని తొలగించిన విద్యుత్ దీపాల మరమ్మత్తులు
- గ్రామస్తులు, కార్యకర్తల సహకారంతో ముందుకు సాగిన అభివృద్ధి పనులు



**గుడిబండ,మార్చి15.అక్షర టైమ్స్:-**(మడకశిర ఇన్చార్జ్) మడకశిర నియోజకవర్గంలో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు శాసనసభ్యులు ఎమ్మెస్ రాజు, గుండుమల తిప్పేస్వామి, డాక్టర్ శ్రీనివాస్ మూర్తి ఆదేశాల మేరకు గుడిబండ మండల పరిధిలో రాళ్లపల్లి పంచాయతీ గ్రామాల్లో చీకటిని తొలగించి వెలుగులు నింపే కార్యక్రమం ప్రారంభమైంది.గత కొంతకాలంగా రిపేర్లు చేయక నిలిచిపోయిన విద్యుత్ దీపాలను మరమ్మతు చేసి, కొత్త వీధి దీపాలను ఏర్పాటు చేయాలని పంచాయతీ సెక్రటరీ పరిపూర్ణాచారికి ఆదేశాలు చేరాయి. ఈ పనులను తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు కలిసి ముందుకు తీసుకెళు న్నారు. ఈ కార్యక్రమంలో మంజునాథ్ ఎన్.ఆర్, రుప్పం మహాదేవప్ప కళ్ళురుప్పం, నాగేంద్ర అప్ప, లక్ష్మీకాంతప్ప బి.గోపాల్, అంజినప్ప ఏ.గోపాల్, నారాయణప్ప, ఉమేష్ తదితర గ్రామస్తులు చురుకుగా పాల్గొన్నారు. గ్రామాల్లో వెలుగులు వెలిగిన వెంటనే ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ప్రజల అభిప్రాయం ప్రకారం --- భద్రత, సౌకర్యం పెరగడంతో పాటు గ్రామీణ అభివృద్ధికి ఇది ఒక ముఖ్యమైన అడుగుగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు.

# పనిగంటలు దేశగతిని మారుస్తాయా?



ఒకరేమో వారానికి 70 గంటలు పనిచేయమంటారు. మరొకరు ఇంకో అడుగు ముందుకేసి 90 గంటలు పనిచేయమంటారు. దేశం అభివృద్ధి పథంలో పయనించేందుకు ఉన్న ఒకే ఒక్క మంత్రం ఇదేనంటారు. కానీ, వారానికి 48 గంటలు పనిచేస్తూనే ప్రపంచం నివ్వెరపోయే ప్రగతి సాధించామన్న విషయాన్ని వారు మర్చిపోతున్నారు. అంతేకాదు, రోజంతా ఆఫీసుల్లోనే ఉండి రోబోల్లా పనిచేస్తూ పోతే దేశం అభివృద్ధి సంగతి దేవుడెరుగు, తలెత్తే మానసిక, ఆరోగ్య సమస్యల సంగతేంటన్న ప్రశ్న ఉత్పన్నమవుతుందన్న విషయాన్ని వారు మర్చిపోతున్నారు. ఉద్యోగులు వారానికి 70 గంటలు పనిచేస్తే దేశం గొప్ప పురోగతి సాధిస్తుందని ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి గతంలో ప్రకటించి దేశవ్యాప్త చర్చకు కారణమయ్యారు. తాజాగా, ఎల్‌అండ్‌టీ చైర్మన్ సుబ్రహ్మణ్యన్ ఒకడుగు ముందుకు వేసి వారానికి 90 గంటలు పనిచేయాలని సెలవిచ్చి అందరినీ దిగ్భ్రాంతికి గురిచేశారు. నిజానికి ఫ్యాక్టరీల చట్టం 1948 ప్రకారం వారానికి 48 గంటలు మించి పనిచేయకూడదు. ఈ చట్టాలను అనుసరిస్తూనే 75 ఏండ్లలో దేశం అనూహ్య ప్రగతి సాధించింది. ఈ నేపథ్యంలో ఈ ఇద్దరు కార్పొరేట్ దిగ్గజాలు భారత శ్రామికులను వారానికి 70 నుంచి 90 గంటలు పనిచేయాలని సూచించడం ఎంతమాత్రం హేతుబద్ధంగా, ఆచరణాత్మకంగా కనిపించడం లేదు. సుబ్రహ్మణ్యన్ చెప్తున్న దాని ప్రకారం వారానికి 90 గంటలు పనిచేయడమంటే రోజుకు 12 గంటలకు పైగా శ్రమపడాల్సి ఉంటుంది. నారాయణమూర్తి 70 గంటల ప్రతిపాదనను ఎంతోమంది విమర్శించారు. ఇప్పుడు సుబ్రహ్మణ్యన్ అంతకుమించి విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. సోషల్ మీడియా ఆయనపై జోక్స్, మీమ్స్‌తో విరుచుకుపడింది. గతంలో ఎలాన్ మస్క్, జాక్ మా కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేసి విమర్శల పాలయ్యారు. 48 గంటల పని విధానం దేశంలో కొనసాగుతున్నప్పటికీ నగర, పట్టణ ప్రాంతాల్లోని కంపెనీ ఉద్యోగులు తగిన వేతనం పొందకుండానే పరిమితికి మించి పనిచేస్తున్న మాట వాస్తవం. ఉద్యోగులు కష్టపడి పనిచేస్తూ దేశాన్ని ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ స్థాయికి తీసుకెళ్లారు. సాధారణ పనిదినాల అమలు చట్టాలు వర్తించని రీతిలో 88 శాతం మంది భారత ఉద్యోగులను కంపెనీలు నియమించుకుంటున్నాయని ఇండీడ్ అనే గ్లోబల్ సంస్థ సర్వేలో తేలింది. ప్రభుత్వ సెలవు దినాలు, సిక్ లీవ్‌లో ఉన్నప్పుడు కూడా కంపెనీ యాజమాన్యాలు తమతో పనిచేయించుకుంటున్నాయని 85 శాతం మంది ఉద్యోగులు చెప్పినట్టు సర్వే పేర్కొన్నది. విధులు ముగిశాక యాజమాన్యాలు పంపే సందేశాలకు స్పందించకుంటే ప్రమోషన్లు వంటి ప్రయోజనాలను ఎక్కడ కోల్పోతామోనన్న భయం ఉద్యోగులను వెంటాడుతూ ఉంటుంది. కొన్ని రంగాల్లో ఉద్యోగులు ఇప్పటికే పనికి సంబంధించి కంపెనీ ఆదేశాలు పాటించేందుకు రోజంతా అందుబాటులో ఉంటున్నారు. కొందరు అదనపు జీతభత్యాలు పొందకుండానే నిర్దేశిత పని గంటలకు మించి శ్రమపడుతున్నారు. కానీ, పదిహేను అగ్రశ్రేణి గ్లోబల్ టెక్ కంపెనీల ఉద్యోగులు వారానికి 50 గంటల లోపే పనిచేస్తుండటం గమనార్హం. 'ఓవర్‌టైమ్' కారణంగా అత్యధిక మరణాలు సంభవించే దేశాల్లో ఇండియా ముందు వరుసలో ఉందని అంతర్జాతీయ కార్మిక సంస్థ, ప్రపంచ ఆరోగ్య సంస్థ సంయుక్త సర్వేలో వెల్లడైంది. సుబ్రహ్మణ్యన్ వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తడంతో ఎల్‌అండ్‌టీ స్పందించింది. అసాధారణ ఫలితాలు సాధించేందుకు అసాధారణ ప్రయత్నాలు చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పడానికి మాత్రమే సుబ్రహ్మణ్యన్ ఆ వ్యాఖ్యలు చేశారని చెప్పుకొచ్చింది. అభివృద్ధి చెందిన దేశంగా ఇండియాను ముందుకు తీసుకెళ్లడానికి మరింత అంకితభావంతో పనిచేయాలనేదే ఎల్ అండ్ టీ లక్ష్యమని, కంపెనీ ఉద్దేశాన్ని, విస్తృత లక్ష్యాలను చైర్మన్ వ్యాఖ్యలు ప్రతిబింబిస్తున్నాయని వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. ఇక నారాయణమూర్తి వారానికి 70 గంటల పని విధానం ప్రతిపాదనపై ప్రముఖ ఐటీ కంపెనీ జోహో కార్పొరేషన్ సీఈవో శ్రీధర్ వెంబూ తీవ్రంగానే స్పందించారు. 'జపాన్, దక్షిణ కొరియా, తైవాన్, చైనాలు మితిమీరిన శ్రమతో అభివృద్ధి సాధించాయి. ఇవి తమ ప్రజలను శిక్షించే స్థాయిలో పనిభారం మోపాయి. ఆఫీసుల్లో, ఫ్యాక్టరీల్లో రెక్కలుముక్కలు చేసుకుని జనం పనిచేసిన కారణంగా ఈ దేశాల్లో జనాభా బాగా తగ్గిపోతున్నది. ఫలితంగా అక్కడి ప్రభుత్వాలే ప్రజలను ఇంకా ఎక్కువ పిల్లలను కనండి అని వేడుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది' అని విరుచుకుపడ్డారు. ఎక్కువ గంటలు కష్టపడి పనిచేస్తూ అభివృద్ధి సాధించిన దేశాల్లోని ప్రజలు వృద్ధాప్యంలో ఒంటరిగా బతకాల్సిన పరిస్థితి వస్తుందని ఆయన హెచ్చరించారు. కంపెనీల రథసారథులు కొద్దిమంది ఎక్కువ గంటలు పనిచేస్తే చాలని, ఉద్యోగులంతా ఒళ్లు హూనం చేసుకుని శ్రమిస్తే వ్యతిరేక ఫలితాలు తప్పవని ఆయన అభిప్రాయపడ్డారు. ఆర్థిక ప్రగతిలో ఇండియాకు చైనా ఎన్నటికీ ఆదర్శం కాకూడదని వెంబూ చేసిన హెచ్చరిక హేతుబద్ధంగా కనిపిస్తున్నది. మూర్తి, సుబ్రహ్మణ్యన్ చెప్పినట్టు రోజుకు అందరూ సగటున పది గంటలు పనిచేస్తే ఆయుష్షు కూడా తగ్గిపోయే అవకాశం ఉన్నదని చెప్తున్నారు. అధిక పనిగంటల వల్ల మానసిక, శారీరక ఒత్తిడి పెరుగుతుంది. అప్పుడు సామాజిక జీవితం అంటూ ఏమీ మిగలదన్నది అత్యధికుల మాట. భారత శీఘ్ర ఆర్థిక ప్రగతికి ఈ ఇద్దరు దక్షిణాది కార్పొరేట్ దిగ్గజాలు ఒకే తీరున సూచించిన పరిష్కార మార్గాలను పరిశీలిస్తే ఇండియాలో 1970, 80లలో ప్రచారంలో ఉన్న ఒక వింత పుక్కిటి పురాణం పాత తరం వారికి గుర్తుకొస్తున్నది. అప్పట్లో జపాన్ అనేక రంగాల్లో అమెరికా, ఐరోపా దేశాలను తలదన్నే రీతిలో ఆర్థికాభివృద్ధి సాధించడం మొదలైంది. దానికి కారణం జపాన్‌లో కార్మికులకు కంపెనీల యాజమాన్యాలపై అసంతృప్తి, ఆగ్రహం వస్తే పని బంద్ చేసి సమ్మెలకు దిగకుండా ఫ్యాక్టరీల్లో ఎక్కువ గంటలు పని చేసేవారనే ప్రచారం దేశవ్యాప్తంగా నడిచింది.

# ఇప్పటికీ మీరే మా నమ్మకం



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అన్న విషయం చాలామందికి తెలియదని ఇటీవలి ఉదంతాలు చెప్తున్నాయి. స్వతహాగానే ఇది రేవంత్‌రెడ్డికి కోపం తెప్పించింది. అదే సమయంలో బీఆర్ఎస్ అధికారం కోల్పోయి ఏడాది దాటినా కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు ప్రతిక్షణం కేసీఆర్, కేటీఆర్‌ను గుర్తుచేస్తున్నాయి. కేరళలో గత నవంబర్‌లో జరిగిన 'టీఐఈ కేరళ 2024'కు హాజరైన కేటీఆర్‌ను మంత్రిగా పేర్కొంటూ వేదికపై ఆహ్వానించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. తానిప్పుడు మంత్రిని కాదని కేటీఆర్ చెప్పినా.. తమకు అలాగే గుర్తున్నారని వారు చెప్పడం గమనార్హం. ఈ రెండు ఘటనలను బట్టి రేవంత్‌రెడ్డి నేర్చుకోవాల్సింది చాలానే ఉందన్నది నిపుణుల మాట. 'స్టిల్ వియ్ బిలీవ్ ఇన్ యూ సర్'.. ఈ మాట నేను అంటున్నది కాదు. ఇటీవల కేరళ లోని కొచ్చిలో టీఐఈ (ది ఇండస్ ఆంత్రప్రెన్యూర్స్) అనే అంతర్జాతీయస్థాయి సంస్థ ఏర్పాటుచేసిన ప్రముఖుల సమావేశంలో వ్యాఖ్యాత కేటీఆర్‌ను వేదిక పైకి ఆహ్వానిస్తూ తెలంగాణ ఐటీ పరిశ్రమలశాఖ మంత్రిగా సంబోధించారు. 'ఇప్పుడు కాదు' అని కేటీఆర్ సవరించిన సందర్భంలో వ్యాఖ్యాత మరో మాట అన్నారు. 'ఇంకా మేము మిమ్మల్ని మంత్రి గానే భావిస్తున్నాం. విశ్వసిస్తున్నాం' అని ఆ మాటలకు అర్థం. పారిశ్రామిక ఐటీ రంగ నిపుణులపై జాతీయ అంతర్జాతీయ స్థాయిలో కేటీఆర్ ప్రభావం ఎంత ఉందో తెలుసుకోవడానికి ఆ వ్యాఖ్యాత మాటలే తార్కాణం. స్వరాష్ట్రంలో కేసీఆర్ సారథ్యంలో ఐటీ పురపాలక పరిశ్రమల శాఖ మంత్రిగా కేటీఆర్ నేతృత్వంలో హైదరాబాద్ సాధించిన అభివృద్ధిని చూసిన వారు ఎవరైనా నిజాయతీగా ఆ మాట అని తీరాల్సిందే. కేటీఆర్ మంత్రి పదవి పోయి, కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా ఇంకా కేటీఆర్‌ను మంత్రిగా సంబోధించడం, ముఖ్యమంత్రి పేరును మర్చిపోవడం వంటి సంఘటనలు కాకతాళీయమే అయినప్పటికీ ప్రజలపై వారి ముద్ర ఏ స్థాయిలో ఉందన్నది మాత్రం వెల్లడవుతున్నది. హైదరాబాద్ పేరు ప్రతిష్ఠలు ప్రపంచం నలుదిశలా వ్యాపించేలా కేటీఆర్ చేపట్టిన కార్యక్రమమే 'ఫార్ములా ఈ' రేస్. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో మహానగరాలు పోటీ పడినప్పటికీ ఈ రేసును హైదరాబాద్‌కు రప్పించడంలో కేటీఆర్ వ్యవహార దక్షత ప్రదర్శించి విజయం సాధించారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సైతం 'ఫార్ములా ఈ' రేస్ వల్ల హైదరాబాద్ ప్రతిష్ఠ పెరిగిందని పేర్కొనడం గమనార్హం. 'ఫార్ములా ఈ' రేస్ వివాదం ముదిరి పాకానపడటం రాష్ట్ర భవిష్యత్తుకు క్షేమకరం కాదని మాజీ ఐపీఎస్ అధికారి వీవీ లక్ష్మీనారాయణ అభిప్రాయపడ్డారు. 'ఫార్ములా ఈ' రేస్ పరమార్థం గ్రహించి రేవంత్ ప్రభుత్వం దానిని కొనసాగిస్తే బాగుండేది. పైగా సాధించి తెచ్చిన కేటీఆర్ మీద అభియోగాలు మోపింది. అరెస్టుకు రంగం సిద్ధం చేస్తున్నది. కేసీఆర్ మీద కోపం ఉంటే ఎన్నికల్లో, రాజకీయాల్లో తేల్చుకోవాలి. కానీ, ప్రజలకు, ప్రాంతానికి మేలు చేసే పథకాలను, కార్యక్రమాలను, ప్రాజెక్టులను ఏ ప్రభుత్వానివైనా కొనసాగించాలి తప్ప నీరు కార్చడం న్యాయం కాదంటున్న ప్రజల వేదన అరణ్య రోదనగా మిగిలిపోతున్నది. వివాదాలు, భయాలు సృష్టిస్తే పెట్టుబడులు వెనక్కి వెళ్లిపోయి అసలుకే మోసం వస్తుందన్న నిపుణుల హితవచనాలు ప్రభుత్వం చెవికి ఎక్కడం లేదు. ఉద్యమ సమయంలో నాటి సమైక్యవాది లగడపాటి రాజగోపాల్ ఓ సందర్భంలో కరుడుగట్టిన తెలంగాణ ఉద్యమకారులు సైతం కన్నీరు పెట్టుకునే రోజు వస్తుందని శాపనార్థాలు పెట్టారు. రెండు జర్మన్ దేశాలు కలిసినట్టుగా విడిపోయిన తెలుగు రాష్ట్రాలు తిరిగి కలిసే అవకాశం ఉందని కొందరు అంచనాలు వేశారు. కర్నూలుకు చెందిన అప్పటి ఎంపీ హైదరాబాదులో సీమాంధ్రులకు రక్షణ లేదని, తుపాకులు ఇవ్వాలని అడిగాడు. కేంద్రపాలిత ప్రాంతంగా హైదరాబాద్ అంటూ కొత్త రాగం ఎత్తుకున్నారు. మొత్తంగా తెలంగాణను ఒక విఫల రాష్ట్రంగా, వికల రాష్ట్రంగా చూపించడానికి, హైదరాబాద్‌ను తెలంగాణకు కాకుండా చేయడానికి స్వరాష్ట్రం ఏర్పడ్డ తొలినాళ్లలో వ్యతిరేక శక్తులు చేయని ప్రయత్నం అంటూ లేదు. ఓటుకు నోటు ఆ కుతంత్రాల్లో భాగమే. ఇప్పుడు ఆ కుట్రలు వివిధ రూపాల్లో మళ్లీ మొలకెత్తుతున్నాయన్న అనుమానాలు బలపడుతున్నాయి. కేసీఆర్ పరిపాలన దక్షత, కేటీఆర్ కార్యశీలత వల్ల హైదరాబాదులో స్థిరపడ్డ ఇతర రాష్ట్రాల ప్రజలు, స్థానికులు కేసీఆర్ వైపు వచ్చి చేరారు. పిల్లకోడిని గద్దలు తన్నుకుపోకుండా తల్లికోడి కాపాడుకున్నట్టు ప్రత్యర్థుల కుట్రలను ఎక్కడికక్కడ తిప్పికొడుతూ కేసీఆర్ హైదరాబాద్‌ను కాపాడుకున్నారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ (బీఆర్ఎస్) గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 24 సీట్లలో సాధించినవి కేవలం 3 కాగా, 2015 గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఏకంగా 150 సీట్లకు గాను 99 సాధించింది. హైదరాబాద్ ప్రజలలో వచ్చిన మార్పుకు అది తొలి సంకేతం. గ్రేటర్ చరిత్రలో ఏ పార్టీ ఈ స్థాయిలో ఏకపక్ష విజయం సాధించలేదు. ప్రజలు అందించిన స్ఫూర్తి, సహకారంతో హైదరాబాద్ అభివృద్ధిని పరుగులు పెట్టించడంలో కేటీఆర్ వందకు వంద మార్కులు కొట్టేశారు. 2009లో తొలిసారిగా అసెంబ్లీ బరిలో దిగినప్పుడు కేటీఆర్ ఉద్యమకారుడే కానీ రాజకీయాలకు కొత్త. పైగా ఆ ఎన్నికల నాటికి సిరిసిల్ల నియోజకవర్గం టీఆర్ఎస్(బీఆర్ఎస్)కు వడ్డించిన విస్తరి కాదు. అంతకుముందు అక్కడ గెలిచిన చరిత్రా లేదు. అయినా సిరిసిల్ల బరిలో దిగి నాటి నుంచి వరుసగా ఐదుసార్లు విజయం సాధిస్తూ వస్తున్నారు. 2014, 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రస్థాయి ప్రచార బాధ్యతలు నిర్వహిస్తూ సొంత నియోజకవర్గానికి ఒకటికి రెండుసార్లు వెళ్లినా సిరిసిల్ల ప్రజలు అర్థం చేసుకొని అక్కున చేర్చుకొని ఆదరించారు. తెలంగాణ ఉద్యమంలో అందరితోపాటు కేటీఆర్ కేసులు ఎదుర్కొన్నారు. కేటీఆర్‌కు ఉద్యమ నేపథ్యం ఉంది. ఉన్నత చదువుల జ్ఞానం ఉంది. మంత్రిగా ప్రపంచస్థాయి గుర్తింపు ఉంది. ఐటీ పారిశ్రామిక రంగాల్లో కేటీఆర్ సాధించిన విజయాలతో ప్రస్తుత ప్రభుత్వ పనితీరును, వైఫల్యాలను పోల్చి చూసుకుంటూ ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇక ఆయా రంగాల్లో కేటీఆర్ ప్రసంగాలను ప్రస్తుత ప్రభుత్వ అధినేతల ప్రసంగాలను పక్కపక్కనే ఉంచి సోషల్ మీడియా ఓ ఆటాడుకుంటున్నది. కేటీఆర్ ఎక్కడికక్కడ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి నిలదీసి ప్రశ్నిస్తున్నందుకు సహించలేక ఎటూ పాలు పోక మాంత్రికుల వేషాలు, మాయోపాయాలు, ఆంక్షలు, అభియోగాలకు తెగిస్తున్నారు. మొన్న ఏసీబీ కార్యాలయం నుంచి తెలంగాణ భవన్‌కు వచ్చిన కేటీఆర్ వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిందని మరో కొత్త కేసు పెట్టారు. ఇక ఫార్ములా కేసు వ్యవహారం న్యాయస్థానం దాకా వెళ్లింది. ఏం జరుగుతుందో కాలం నిర్ణయిస్తుంది. కాగా, కేటీఆర్‌ను ఉద్దేశించి ఆ కేరళలో అన్న మాటలు తెలంగాణలో పదేపదే ప్రతిధ్వనిస్తున్నాయి. 'స్టిల్ వియ్ బిలీవ్ ఇన్ యూ సర్'. కేటీఆర్‌కు ఉద్యమ నేపథ్యం ఉంది. ఉన్నత చదువుల జ్ఞానం ఉంది. మంత్రిగా ప్రపంచస్థాయి గుర్తింపు ఉంది. ఐటీ పారిశ్రామిక రంగాల్లో కేటీఆర్ సాధించిన విజయాలతో ప్రస్తుత ప్రభుత్వ పనితీరును, వైఫల్యాలను పోల్చి చూసుకుంటూ ప్రజలు పెదవి విరుస్తున్నారు.

# డ్రాగన్ ఫ్రూట్ తింటే ఎన్ని లాభాలు కలుగుతాయో తెలుసా ఇవి తెలిస్తే వెంటనే తింటారు



చూసేందుకు పింక్ రంగులో ఎంతో ఆకర్షణీయంగా మనకు డ్రాగన్ ఫ్రూట్ పండ్లు కనిపిస్తాయి. వీటినే పిటాయా అని కూడా పిలుస్తారు. డ్రాగన్ ఫ్రూట్స్ మనకు ఇప్పుడు ఎక్కడ చూసినా అందుబాటులో ఉంటున్నాయి. కేవలం చైనాకు మాత్రమే పరిమితం అయిన ఈ పండును ప్రస్తుతం మన దేశంలోనూ సాగు చేస్తున్నారు. అందువల్ల మనకు డ్రాగన్ ఫ్రూట్స్ విరివిగా లభిస్తున్నాయి. ఇక సీజన్ కావడంతో ప్రస్తుతం మనకు రహదారుల పక్కన డ్రాగన్ ఫ్రూట్స్ ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇవి పైకి పింక్ రంగులో, లోపల తెలుపు రంగులో ఉంటాయి. తింటే రుచి కాస్త చప్పగా, వగరుగా ఉంటుంది. అయితే డ్రాగన్ ఫ్రూట్ పండ్లను నిజంగా మనకు లభించిన వరం అనే చెప్పవచ్చు. ఈ పండ్లను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. డ్రాగన్ ఫ్రూట్‌ను తింటే మనకు అనేక పోషకాలు లభిస్తాయి. దీంతో ఆరోగ్యంగా ఉండవచ్చు.

### ప్రాణాంతక వ్యాధులు రావు..

డ్రాగన్ ఫ్రూట్‌లో మన శరీరానికి కావల్సిన అనేకే విటమిన్లు, మినరల్స్ ఉంటాయి. అలాగే యాంటీ ఆక్సిడెంట్లు కూడా వీటిల్లో అధికంగానే ఉంటాయి. ఫైబర్ సమృద్ధిగా లభిస్తుంది. ఇవన్నీ మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. వ్యాధులు రాకుండా రక్షిస్తాయి. డ్రాగన్ ఫ్రూట్‌ను తినడం వల్ల బీటా సయనిన్స్ అనబడే యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. అలాగే ఈ పండ్లలో ఫ్లేవనాయిడ్స్, విటమిన్ సి కూడా ఎక్కువగానే ఉంటాయి. ఇవి యాంటీ ఆక్సిడెంట్ల మాదిరిగా పనిచేస్తాయి. ఫ్రీ ర్యాడికల్స్‌ను నాశనం చేస్తాయి. దీంతో వాపులు తగ్గుతాయి. ఈ సమ్మేళనాలు క్యాన్సర్, గుండె జబ్బులు వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా మనల్ని రక్షిస్తాయి. అందువల్ల డ్రాగన్ ఫ్రూట్స్‌ను తింటే గుండె ఆరోగ్యంగా ఉంటుంది. క్యాన్సర్లు రాకుండా చూసుకోవచ్చు.

### అధిక బరువు, షుగర్‌కు చెక్..

డ్రాగన్ ఫ్రూట్‌లో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. ఫైబర్ అధికంగా ఉంటుంది. అందువల్ల ఎక్కువ సేపు ఉన్నా కడుపు నిండిన భావన కలుగుతుంది. ఆకలి నియంత్రణలో ఉంటుంది. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు ఎంతగానో సహాయపడుతుంది. డ్రాగన్ ఫ్రూట్‌ను రోజూ తినడం వల్ల బరువును సులభంగా తగ్గించుకోవచ్చు. అలాగే అధ్యయనాలు చెబుతున్న ప్రకారం డ్రాగన్ ఫ్రూట్‌ను తినడం వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీ పెరుగుతుంది. దీంతో శరీరం ఇన్సులిన్‌ను మరింత సమర్థవంతంగా ఉపయోగించుకుంటుంది. ఫలితంగా షుగర్ లెవల్స్ తగ్గుతాయి. ముఖ్యంగా టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారు డ్రాగన్ ఫ్రూట్‌ను తింటే షుగర్‌ను కంట్రోల్‌లో ఉంచుకోవచ్చు. దీంతో ఇతర అవయవాల ఆరోగ్యం దెబ్బ తినకుండా ఉంటుంది.

### గుండె ఆరోగ్యానికి..

డ్రాగన్ ఫ్రూట్‌ను తినడం వల్ల శరీరం కొల్లాజెన్‌ను ఎక్కువగా ఉత్పత్తి చేస్తుంది. ఇది చర్మం సాగే గుణాన్ని పెంచుతుంది. దీంతో చర్మంపై ఉండే ముడతలు తగ్గిపోతాయి. ఈ పండ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని అతినీలలోహిత కిరణాలు, కాలుష్యం బారి నుంచి రక్షిస్తాయి. దీంతో చర్మం కాంతివంతంగా మారి మృదువుగా ఉంటుంది. డ్రాగన్ ఫ్రూట్‌ను తినడం వల్ల గుండె పనితీరు మెరుగు పడుతుంది. ఈ పండ్లలో ఒమెగా 3, ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ లెవల్స్‌ను అదుపులో ఉంచుతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. డ్రాగన్ ఫ్రూట్‌లో ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. దీంతో మలబద్ధకం తగ్గుతుంది. అలాగే గ్యాస్, అసిడిటీ, అజీర్తి నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇలా డ్రాగన్ ఫ్రూట్‌ను తినడం వల్ల అనేక అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. కనుక వీటిని రోజువారి ఆహారంలో భాగం చేసుకోవాలి.